క్లుప్తంగా

ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను కలిసిన సీఐ



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో సీఐ ప్రసాదరావు

పోలాకి: మబగాంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి.ప్రసాదరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీపడవద్దని సూచించారు. పోలాకి, నరసన్నపేట ఎస్‌ఐలు ఉన్నారు. అలాగే శ్రీకాకుళంలో ఎస్పీ రాధికను సీఐ ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘటనా స్థలం పరిశీలన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పొందూరు: పొందూరులో విద్యుత్‌ఘాతంతో ఆదివారం యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. సంఘటన స్థలాన్ని విద్యుత్‌శాఖ అధికారులు ఎంఅండ్‌పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుదర్శనరావు, ట్రాన్స్‌ఫారం సెక్షన్ ఈఈ వెంకటరావు సోమవారం పరిశీలించారు. 33బై11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడటానికి కారణాలను పరిశీలించారు. రెగ్యులర్ పరిశీలనలో భాగంగా విద్యుత్ వైర్లను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. యువకుడి మృతిపై పూర్తి సమాచారాన్ని అందించాలని ఎలక్ట్రికల్ ఏఈ దుర్గాప్రసాద్‌ను ఆదేశించారు.

అదనపు ప్యాకేజీలు చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, నిర్వాసితులు

కొత్తూరు: పలువురు వంశధార నిర్వాసితులకు ప్రభుత్వం ఇంతవరకు చెల్లించని అదనపు ప్యాకేజీలను వెంటనే చెల్లించాలని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ పెదకోట సాదుబాబు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో నిర్వాసితులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది అదనపు ప్యాకేజీలు చెల్లించినప్పటికీ ఇంతవరకు కొంతమందికి ప్యాకేజీలు అందలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న కుటుంబాలతోపాటు మరణించిన వ్యక్తులకు మంజూరైన ప్యాకేజీలు వారి వారసులకు అందజేయాలని విన్నవించారు.

గ్రోయిన్లు నిర్మించండి



ఉధృతంగా వంశధార నదీ ప్రవాహం

జలుమూరు: మండలంలోని అంధవరం పంచాయతీ ఉప్పరపేట వద్ద గ్రోయిన్లు లేక ప్రతి ఏటా వర్షా కాలంలో వంశధార నది ప్రవాహానికి అవస్థలు పడుతున్నామని అంధవరం, ఉప్పరపేట, రామకృష్ణాపురం, పర్లాం, మాకివలస తదితర గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహం అధికమైతే ఇక్కడ రోడ్డు శిథిలమై సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలు కూడా స్తంభించిపోతాయన్నారు. వరద తాకిడికి పొలాలు నీట మునిగి ఏటా నష్టం కలుగుతుందన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గ్రోయినుల వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రోయిన్లు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

సామాజిక భవనం మంజూరుకు కృషి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

ఆమదాలవలస: నాయీబ్రాహ్మణ కుటుంబాల వినియోగానికి ఆమదాలవలస పట్టణంలో సామాజిక భవనం మంజూరు చేసేందుకు తన వంతు కృషిచేస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్పీకర్‌ను ఆయన నివాసంలో సోమవారం నియోజకవర్గంలోని పలువురు నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు కలిశారు. సమస్యలు తెలుపుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జె.కె.వెంకుబాబు, నాయీబ్రాహ్మణ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పొందూరు: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పొందూరు: ప్రజాప్రయోజనాలకు, పక్కాగా సంక్షేమ పథకాలు అందించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కోటిపల్లి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రూ.64 లక్షల నిధులతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో కాలువలు, రోడ్లు కావాలని స్పీకర్‌ను స్థానికులు కోరారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి, గురుగుబెల్లి వాసు, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు..

పాతపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందించిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ రవిచంద్ర, డీటీ ప్రసాద్, ఏపీఎం మనోరత్నం, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పాతపట్నం: కాపుగోపాలపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాఠశాల కిటికీ అద్దాల ధ్వంసం



పగలగొట్టిన కిటికీ అద్దాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 చంద్రమౌళి

ఎల్.ఎన్.పేట: మండలంలోని యంబరాం ప్రాథమికోన్నత పాఠశాల మేడపై ఉన్న తరగతి గది కిటికీ అద్దాలు గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారని ఎంఈఓ-2 కె చంద్రమౌళి తెలిపారు. శనివారం పాఠశాల పని వేళలు ముగిసిన తరువాత సాయంత్రం తలుపులు వేసుకుని ఉపాధ్యాయులు వెళ్లిపోయారన్నారు. సోమవారం పాఠశాల తెరిచి చూసేసరికి కిటికీ అద్దాలు పగలగొట్టి ఉన్నట్లు గుర్తించిన హెచ్‌ఎం ఇచ్చిన సమాచారం మేరకు పాఠశాలను పరిశీలించామని తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ అద్దాలు పగలగొట్టినట్లు అనుమానిస్తున్నామన్నారు. ఆదే గదిలో విలువైన టీవీ, ఇతర పరికరాలు ఉన్నాయని, ఆ వస్తువులకు ఎంటువంటి నష్టం జరగలేదన్నారు. కిటికీ అద్దాలు మాత్రమే పగలగొట్టి వెళ్లిపోయారని వివరించారు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామ సచివాలయ మహిళా పోలీసుకు విషయాన్ని తెలియజేశామని, పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గణేష్

పాతపట్నం: డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్ అన్నారు. స్థానిక మార్కెట్ ఏదురుగా ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26వ తేదీల్లో దళిత డప్పు కళాకారులకు రెండు రోజుల పాటు అధ్యాయన తరగతులను నిర్వహించనున్నామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల వెంకటరావు పాల్గొన్నారు.

గడపగడపకు నిధులతో అభివృద్ధి పనులు



రహదారి నిర్మాణ పనులు చేయిస్తున్న సర్పంచ్

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రతీ సచివాలయం పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఆయా నిధులతో అవసరమైన పనులు సంబంధిత సర్పంచ్‌లు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా చిన్నగుజ్జువాడ పంచాయతీ సర్పంచ్ కొండాల బాబూరావు విలేజ్ క్లినిక్‌కు వెళ్లేందుకు రహదారి నిర్మాణం చేపడుతున్నారు.

దళ్లవలసలో పొలంబడి



సబ్సిడీపై రైతులకు వేపనూనె పంపిణీ చేస్తున్న దృశ్యం

పొందూరు: వరి వెద సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జి తెలిపారు. దళ్లవలస గ్రామంలో సోమవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలం గట్లపై రైతులు కంది విత్తనాలు సాగు చేసేందుకు ఉచితంగా విత్తనాలను, 50 శాతం సబ్సిడీపై వేప నూనెను ఎంపీటీసీ కిల్లాన సూర్యారావు ఆధ్వర్యంలో అందజేశారు.

మీనామృతంతో అధిక దిగుబడులు

మెళియాపుట్టి: మీనామృతంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎస్‌డీఏలు ధనుంజయ, నాగరాజు అన్నారు. మండలంలోని మురికింటిభద్ర గ్రామంలో మీనామృతం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. చేపల వ్యర్థాలతో దీన్ని తయారుచేస్తారని, 27 రోజులపాటు నిల్వ ఉంచిన మీనామృతాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల మొక్కకు ఎదుగుదల, బలం వస్తుందన్నారు. సిబ్బంది కూర్మారావు, హరిత, రజిని, సంధ్యారాణి పాల్గొన్నారు.

దైవ చింతనతో సమాజంలో ప్రశాంతత

- వేంకటేశ్వర ఆలయ అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. తొలిత స్వామివారిని స్పీకర్ దంపతులు దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్‌గా సాకా శ్రీధర్, సభ్యులుగా శిల్లా ప్రశాంతలక్ష్మి, ముంగంటి శ్రీనివాసరావు, బలివాడ సంతోషిరూప, పి.ఆర్.సుధారాణి, ఆర్.అరప్ప, ఐ.అనంతరావు, జామి రమేష్‌ను నియమించారు. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాలు, మతాలను సమానంగా చూస్తున్నారన్నారు. ఆలయ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కూడా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆమదాలవలస పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. దేవదాయ శాఖ అధికారుల విలువైన సూచనలతో ఆలయం విశిష్టతను కాపాడాలన్నారు. ఆమదాలవలస పట్టణంలో గల పాలపోలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తున్నట్లు స్పీకర్ చెప్పారు. ఆలయ ఆవరణలో రూ.లక్షల వ్యయంతో శక్తిపీఠాలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. తొగరాం సర్పంచ్ వాణీసీతారాం, మున్సిపల్ వైస్ ఫ్లోర్ లీడర్ ఉమామహేశ్వరరావు మాజీ కౌన్సిలర్లు జె.కె.వెంకుబాబు, దుంపల శ్యామలరావు, శిల్లా మల్లికార్జునరావు, కుసుమంచి శ్యాంప్రసాద్, పార్టీ నాయకులు పొన్నాడ చిన్నారావు, సంపతిరావు రామారావు, సాదు చిరంజీవి పాల్గొన్నారు.


వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం

పోలాకి: మండలంలోని గుప్పెడుపేట గ్రామంలో మత్స్యకారుల ఉపాధి లక్ష్యంగా నెలకొల్పనున్న సీఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్‌కు సభ్యుల వెరిఫికేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఎంసీఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ డివిఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 965 మందికి 863 మందిని గుర్తించారు. వీరి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. పోలాకి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన సాగరమత్స్యకారులు వేట చేసిన పీతలు, రొయ్యలు, ఇతర సీఫుడ్‌ను ఇక్కడే ప్రోసెసింగ్ చేసి ఎగుమతులు చేపట్టే అవకాశం లభించిందని స్థానిక మత్స్యకారసంఘ నాయకుడు, రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య అన్నారు. సెర్ప్ లైవ్లీహుడ్ డైరెక్టర్ సుధాకర్, సర్పంచ్ పైడితాత తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

జలుమూరు: మండలంలోని పాగోడు పంచాయతీలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు సోమవారం తెలిపారు. వెలుసోదలో రూ.11 లక్షలతో ఇంటింటికీ కుళాయిలకు శంకుస్థాపన, మెట్లు ప్రారంభం, పాగోడులో గడపగడప నిధులతో ఇంటింటికీ కుళాయిలు, రూ.25 లక్షలతో నిర్మాణం జరిగిన సచివాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. శ్రీముఖలింగంలో జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటా కుళాయిల పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని సర్పంచ్ టి.సతీష్ తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం



మదనాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

బూర్జ: పల్లె ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని మదనాపురంలో సోమవారం 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి బీపీ, సుగర్ మందులు అందజేశారు. మండలంలోని తమ్మినాయుడుపేట గ్రామంలో అక్కులపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్ర ఆధ్వర్యంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ గ్రామానికి గత కొన్నాళ్లుగా 104 వాహనం రాకపోవడంతో సాక్షి దిన పత్రిక కథనానికి అధికారులు స్పందించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కృషితో గ్రామానికి వాహనం రావడంతో కృతజ్ఞతలు తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ లఖినాన సరోజిని, ఎంఎల్‌హెచ్‌పీ పి.శ్రావ్య, ఏఎన్ఎం కె.ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జె.జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట సీఐగా బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐలతో మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

నరసన్నపేట: పోలీస్ స్టేషన్లలో నమోదు అవుతున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన నరసన్నపేట సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నరసన్నపేట సర్కిల్ పరిధిలో ఉన్న పోలాకి, జలుమూరు, సారవకోట, నరసన్నపేట ఎస్‌ఐలతో సమావేశమయ్యారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టలని సూచించారు. సమన్వయంతో పనిచేసి సర్కిల్‌కు మంచి పేరు తీసుకువద్దామన్నారు. ఎస్‌ఐలు వై.సింహాచలం, జి.అప్పారావు, పి.పారినాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల రక్షణే ప్రభుత్వ ధ్యేయం



పోలాకి: చెల్లాయివలసలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల రక్షణే ప్రభుత్వ విధానమని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చెల్లాయివలస, జడూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రజల మనసుల్లో చెరగని సంక్షేమ సంతకం చేశారని గుర్తుచేశారు. ఆయన వారసుడిగా సీఎం జగన్ సైతం అదే ఒరవడిని కొనసాగిస్తున్నారని, రాజకీయాల్లో మాటతప్పని నాయకునిగా కొనసాగుతున్నారన్నారు. రెండు సచివాలయ పరిధిలో దాదాపు 800 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వైస్ ఎంపీపీ కోట అప్పారావు, స్థానిక సర్పంచ్‌లు చింతు జగ్గనాయుడు, గొల్లంగి అసిరితాత, పార్టీ నాయకులు కణితి సత్తిబాబు, రెంటికోట త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం



ఆమదాలవలస రూరల్: ధ్రువపత్రాలు అందజేస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మార్గంగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలో నెల్లిపర్తి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల సేవలను ఉచితంగా అందించే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, సర్పంచ్ మానుకొండ రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మానుకొండ ధనలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, తహసీల్దార్ గణపతిరావు, ఏఓ మెట్ట మోహనరావు, ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఏపీఎం కూర్మారావు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న వైద్యాధికారి పావని

బూర్జ: మండలంలోని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా రోగులకు వ్యాధి నివారణ కిట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.పావని ఆధ్వర్యంలో 44 మంది మందికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న కిట్లులో ప్లాస్టిక్ టబ్బు, మగ్గు, సబ్బు, తువ్వాలు, ఆయిట్మెంట్ ఉంటాయన్నారు. ఫైలేరియా రోగులు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఈ కిట్లు రోగులు సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. పీహెచ్‌సీ రెండో వైద్యాధికారి జి.రాజశేఖర్, సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు లఖినాన సరోజిని, తేజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: నరసన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నరసన్నపేట, పోలాకి మండలాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పీఓ నాగమణి సోమవారం తెలిపారు. రెండు చోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరు చోట్ల ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రోస్టర్ రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పోలాకి మండలం కొల్లివలస(బీసీ-డీ), నరసన్నపేట మండలం మడపాం-1(ఓసీ) కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా పోస్టులు చిక్కాలవలస(ఎస్సీ), జోగంపేట(ఓసీ), మగతపాడు(బీసీ-డీ), ఉర్జాం-1(బీసీ-ఈ), గంటపేట (ఎస్సీ), కామేశ్వరిపేట(బీసీ-బీ)లకు కేటాయించడం జరిగిందన్నారు.

రెవెన్యూ గ్రామాలకు చేరుకున్న సర్వే రాళ్లు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు రెవెన్యూ గ్రామాలకు సర్వే సరిహద్దు రాళ్లు చేరుకుంటున్నాయి. మండలంలో 47 రెవెన్యూ గ్రామాలు ఉండగా మొదటి విడతలో సర్వే పూర్తిచేసుకున్న రెవెన్యూ గ్రామాల్లో సరిహద్దు రాళ్ల పాతే ప్రక్రియ పూర్తిచేశామని మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య తెలిపారు. ప్రస్తుతం కరకవలస, దబ్బపాడు, జంబాడ, బరటాం, సరడాం, కొత్తపేట, సిద్ధాంతం, మల్లిఖార్జునపురం తదితర రెవెన్యూ గ్రామాల్లో సర్వే చురుగ్గా జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వే పూర్తయిన వెంటనే సరిహద్దు రాళ్లు పాతేందుకు రాళ్లు సిద్ధం చేస్తున్నామన్నారు. మల్లికార్జునపురం రెవెన్యూ గ్రామంలో పాతేందుకు సర్వే సరిహద్దు రాళ్లు వచ్చాయని గ్రామ సచివాలయ సర్వేయర్ మనోజ్‌కుమార్ తెలిపారు.

నవయుగ వైతాళికుడు జాషువా

పాతపట్నం: మండలంలోని బైదలాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా వర్ధంతిని రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పి.గవిరేసు మాట్లాడుతూ ఆధునిక భావకవిత్వానికి కాస్త దూరంగా, సామాజిక సమస్యల్ని ఎత్తిచూపుతూ కవిత్వాలను జాషువా రాసేవారన్నారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలలో పదో తరగతి టాపర్ జి.చందుకు విద్యా పురస్కారం కింద రూ.1,000 అందజేశారు. విశ్రాంత ఉపవిద్యాధికారి వల్లభ మల్లయ్య, ఎం.లోకేశ్వరరావు, వైద్యుడు జి.సదాశివ, పి.రామరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి

పాతపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి ఏపీజీవీబీ విశ్రాంత మేనేజర్ ముళ్ల బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పౌర గ్రంథాలయాలు ఏర్పాటు చేసేందుకు అయ్యంకి చేసిన ఉద్యమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. శాఖా గ్రంథాలయాధికారి కె.రాజు, పి.మల్లేశ్వరరావు, ఎం.భాగ్యవతి, దేవిక, మానస, ప్రవీణ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటా సర్వే

ఎల్.ఎన్.పేట: మండలంలోని కోవిలాం పంచాయతీలో ఓటర్ల జాబితాపై సోమవారం ఇంటింటా సర్వే చేపట్టామని వైఎస్సార్‌సీపీ నాయకుడు లోచర్ల మల్లేశ్వరావు తెలిపారు. బీఎల్‌ఓతో కలిసి రాజకీయ పార్టీల నాయకులు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల ఓట్లు వివరాలు సరిచేయటం జరిగిందన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి మరణించిన, వివాహం జరిగి అత్తవారింటి వెళ్లిన ఆడపిల్లల ఓట్లు తొలగించేందుకు చర్యలు తీసుకున్నామని బీఎల్‌ఓ తెలిపారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు వయసు నిండిన వారికి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కలిగించామని వివరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఆమదాలవలస రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలో కలివరం పంచాయతీ కంచరావువానిపేట గ్రామం సమీపంలో పంచాయతీరాజ్ రహదారికి ఇరువైపులా ఉపాధి హామీ పథకం ద్వారా పంపిణీ చేసిన మొక్కలను సోమవారం నాటారు. ఉపాధి వేతనదారులకు మొక్కల సంరక్షణ బాధ్యతను అప్పగించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవెన్యూ ప్లాంటేషన్..

సరుబుజ్జిలి: మొక్కలను అధికంగా నాటి పచ్చదనాన్ని కావాడాలని రావివలస సర్పంచ్ వండాన కృష్ణ తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, చెరువుగట్లు, రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంచాలని సూచించారు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ లలిత, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.